


# పాటలబండి

సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి

పాట పరవళ్లు తొక్కుతోంది.

సొద్దనాట్లు పచ్చదనం పైన పక్షిలా గిరికీలు కొడుతోంది.

గెనిమ మీద వరసగా కూచుని వున్న కూలీల నడుమ ఓ గొంతులోంచి అలవోకగా బైటబడి పరిసరాల్ని పరవశింపజేస్తోంది.

అటుఇటు మరో రెండు గొంతులు వంతపలుకుతున్నాయి.

వాళ్లకు ఎదురుగా నగం మునంలోనే ఆగిపోయివుంది నాటు.

కూలీలు మునంలోంచి గట్టెక్కినా పాటమాత్రం ఆగలేదు.

విద్యుత్ సరఫరా నిలిచి దాదావు అర్ధగంట కావొస్తోంది.

మోటారువంపు మూగవోవటంతో కయ్యల్లో నీళ్లు పూర్తిగా ఇంకిపోయాయి. కాలువ కూడా బురదగట్టివుంది.

పారే నీళ్ల వెంబడి నాటు సాగుతూ వుండాలి.

నీళ్లు పారకం లేక నాటు ఆగింది.

కూలీలు ఖాళీగా కూచునివున్నారుగాని వాళ్ల నోరు మాత్రం పనిచేస్తూనే వుంది.

మోటారు వద్దనించి వాళ్ల కడకు వస్తోన్న జయమ్మ అసహనంతో రగిలిపోతూవుంది.

మోటారుకూ నాటుకూ మధ్య చాలా సేపట్నించి ఆసుపోసినట్లు తిరుగుతూనే వుంది ఆమె.

కూలీల తోటి కుదురుగా కూచోలేకపోతోంది.

గొంతు కలపలేకపోతోంది.

పాటల మాధుర్యాన్ని సైతం ఆస్వాదించలేకపోతోంది.

తేపతేపకు మోటారుకేసి చూస్తోంది.

మోటారు పక్కన బల్బును నిశితంగా పరిశీలిస్తోంది. గుంతకాడ నక్కలా అక్కడే కాచుక్కూచుని వున్న మొగున్ని చూపుల్తో తడువుతోంది.

కరంటుమీది తన అసహనాన్ని అప్పుడప్పుడూ తిట్లల్లోకి మారుస్తోంది.

సబ్‌స్టేషన్‌లోని ఉద్యోగుల్ని దుమ్మెత్తిపోస్తోంది.

వదిలేది ఒక్కపూట కరంటే అయినా యిట్లా ఇబ్బందులు పెడుతూ కూడా ఏటికేటికి చార్జీల్ని ఇబ్బడిముబ్బడిగా పెంచే ప్రభుత్వాన్ని శపిస్తోంది.

నందకాడో, నగంబొద్దున్నో కరంటు ఉన్నపుడు చేనంతా మూరెడులోతున నీళ్లు నిలిపి తర్వాత నాటుకోడానికి యిది వరినాటుగాదు. అచ్చుగట్టె కయ్యల్ని నీళ్లు తడుపుతూపోతోంటే వెనకే నాట్లు పడుతుండాలి. రవ్వంత ఆలస్యమైనా నీరింకి కాళ్లకు లాడాలు లాడాలుగా బురద అంటుకొస్తుంది.

పొద్దు పడమటికి వాలివుంది.

ఆకాశంలో అక్కడొకటి, యిక్కడొకటి మేఘాలు నిశ్చలంగా వున్నాయి. నిన్నామొన్నయితే గూళ్లుగూళ్లుగా లేచి ఏవేవో ఆశలు రేపాయి.

సంక్రాంతి ముందు యీ ఉత్తుత్తి మేఘాల ఆర్భాటం మామూలే.

గట్టుమీది కూలీల నోళ్లల్లోంచి పాటలు ఆగలేదు.

నాటు ఆగిపోయిందనే బాధ వాళ్ల ఎవరి మొహాల్లోనూ కన్పించలేదు జయమ్మకు.

"ఊరక కూకున్నే కూలొస్చది. వాళ్లకేం నొప్పి? పైటేల తిన్నె సంగటి అరక్క పాటలమీద బన్నెరు' అనుకొంది.

'కూలోల్లకంటే సరే! మొగునికెన్నా వుండాలగదా బాధ'

మోటారు దగ్గర గొంతుక్కూచుని వున్న మొగున్ని చూస్తోంటే రవరవ మండుతోంది ఆమెకు.

కరంటు రాలేదనే ఆరాటంగానీ, ఆవేదనగానీ అతని మొహంలో రవ్వంతయినా కన్పించలేదు.

పైపెచ్చు కూలీల పాటకు గొంతు కలుపుతున్నాడు.

"మా ముగాల్లో ఏముంది? అట్టమల్లి బల్బుదిక్కు సూస్చాండు" ఎక్కన పట్టలేక కేకేసింది మొగునికేసి.

ఒక్కక్షణం కొతుకుబడి తిరిగి కొనసాగింది పాట.

కరంటు రాదని తీర్మానించుకొన్న రైతులు కొందరు నిరాశగా ఇంటిదారిబట్టారు.

అక్కడక్కడా నాటువున్న చేలల్లో మాత్రం చెట్లకిందా, గెట్లమీదా తిష్టవేసి వున్నారు కూలీలు.

తమ పరిస్థితి చాలా దయనీయంగా అన్పించింది జయమ్మకు.

అంతులేని ఆవేదనగా వుంది.

అసహనంతో తలపట్టుకొంటోంది.

తేపతేపకూ కరంటు కట్ గావటం, నాటు కుంటుబడటం, ఆశకొద్దీ పెరిగిపెట్టుకొన్న నారు రేపటికి తలలు వేలాడేయటం, చేనుకొంత బీడుబడటం, పండింది నాటుకు కోతకూళ్లకు కూడా చాలకపోవటం- దృశ్యాలు దృశ్యాలుగా కళ్లముందు కదలాడుతున్నాయి.

కరంటు ఓ సమస్య అయితే పాట మరో సమస్య అయికూచుంది ఆమెకు.

పాటకంటే కూడా- సందర్భోచితం కాని వాళ్ల పకపకల యికయికల సంతోషం ఆమెను నిలువెల్లా కాలుస్తూవుంది.

బల్బు వెలిగినట్లుగా అనిపించి ఉలిక్కిపడి నిశితంగా చూసింది.

ఎండ తీక్షణతకు తళతళమంటోందో, బల్బులోకి కరంటే వచ్చిందో పోల్చుకోలేని పరిస్థితి.

ఇంటాయన మాత్రం స్టార్టర్ వద్దే గొంతుక్కూచుని లల్లాయి పదాలమీదున్నాడు.

ఆదుర్దా ఎక్కువైంది ఆమెకు.

అటుఇటు మోటార్లకేసి నిక్కినిక్కి చూసింది.

అక్కడి మనుషుల కదలికల్లోని హుషారుదనం గమనించగానే, పరిస్థితి అర్థమైతటాలున మొగునికేసి తలతిప్పబోతూనే కేకేసింది.

అతను కదలి స్టార్టర్ స్విచ్ నొక్కేసరికి కూలీల్ని కదలించింది.

కరంటు ఆగమనాన్ని గురించి అక్కడ పాట మొదలైంది.

గుడ్డలు విదిల్చుకొంటూ, ఒళ్లు కదల్చుకొంటూ మునాల్లోకి దిగేసరికి నీళ్లు కూడా కయ్యల్లోకి సాగాయి.

"వంగండి... వంగండి..." వాళ్ల మీద అసహనపడింది.

చుట్టుపట్ల మోటార్లన్నీ యింకా స్టార్ట్ చేయకపోవటం వల్ల కరంటు దండిగా అంది పంపులోంచి నీళ్లు ఉరవడిగా దూకుతున్నాయి.

కయ్య పారేసరికి నాటు వెనకబడింది.

కూలీల్ని తొందరచేయటం మొదలెట్టింది జయమ్మ.

నీళ్లతోటి హుషారుగా చేతులు కదల్చలేని వాళ్ల పనిపట్ల అసహనపడుతోంది. వాళ్ల పాటమీద మండిపడుతోంది.

ఈలోపు వూర్లోంచి వచ్చిన రైతులు ఎవరి మోటార్లను వాళ్లు స్టార్ట్ జేసేసరికి ట్రాన్స్‌ఫార్మర్‌లో ఓల్టేజి బాగా తగ్గింది. మోటారు వేగం మందగించింది. కాలువలో నీళ్లు కూడా పలుచబడ్డాయి.

కయ్యకు ఇద్దరి వంతున పదిమంది కూలీలు పెంటినారు నాటుతున్నారు. మరో ఇద్దరు కేవలం గెట్లవెంట పోతునారు దిగజెక్కుతున్నారు.

రెండురకాల నారూ కలవకుండా జాగ్రత్తలు తీసికొంటూ కూలీల్ని అజమాయిషీ చేస్తోంది జయమ్మ.

మడవకు బొక్కలుబడి పారిన కయ్యే మళ్లీ తడుస్తోంటే ఆదరాబాదరా వెళ్లి మట్టి అడ్డమేసి మొగునికేసి చూసింది.

మడవ కట్టేందుకూడా వొల్లొంగని అతని సోమరితనంకేసి అసహనంగా చూసింది.

పారపట్టుకొని నిల్చున్నాడుగాని పని మీద మనస్సు పెట్టలేదు.

అతని నిర్లక్ష్యం మీద కోపం ముంచుకొచ్చింది.

పొలం పనుల్లో వేలుపెట్టనీకుండా చదివించి ఎందుకూ పనికిరానివాన్నిగా చేసిన అత్తమామల మీద కోపమొచ్చింది.

బియ్యాడి చేశాడు కాబట్టి ఖచ్చితంగా ఉపాధ్యాయుడవుతాడనే ఆశతో తన్నతనికిచ్చి పెళ్లిచేసిన తల్లిదండ్రులమీద కోపం రేగింది.

భూములన్నిటీ్ని కోరుకో గుత్తకో ఇద్దామంటాడు. ఉద్యోగమొచ్చేంతవరకూ

కూచుని తిందామంటాడు. లేదా వ్యాపారం పెట్టుకొందామంటాడు.

స్వంతంగా సేద్యం చేద్దామంటే సీమ కరువు గురించీ, పైరు చీడపీడల గురించీ మాట్లాడ్తాడు.

తనుకూడా కాడెద్దులు పెట్టి సేద్యం చేసేందుకు వ్యతిరేకమే. కూళ్లు పెట్టి చేయించుకోవాలనే.

మడవకు కూడా అతన్ని పిల్చేదికాదు.

'గంటసేపు కూడా రాని యీ కరంటు కోసం యాభైరూపాయల కూలి ఎందుకు వృధా చేయాలా?' అనే.

తన పుట్టింట కూడా ఎద్దుల సేద్యం ఎప్పుడో ఎత్తేశారు.

తన అన్నలయితే ఇస్త్రీ మడతలు నలగకుండా గెట్టుమీద కూచుని పైర్లు పెట్టుకొంటున్నారు. సుఖంగానే బతుకుతున్నారు.

తకా మెలకువలు తెలుసు. సమర్థవంతంగా అజమాయిషీ చేసి కూలీలచేత ఎట్లా పన్జేయించుకోవాలో తనకు బాగా అనుభవమే.

ఆలోచనల్లోంచి తేరుకొని చివరిమునంలో గెట్టు వెంబడి పోతునారు నాటటం మరచిన రిబకమ్మను కేకేసింది.

నాటు మంచి ఊపుమీదుంది.

నాటులాగే పాట పరిసరాలన్నిట్నీ పచ్చగా మారుస్తోంది.

పాటలాగే నాటు నేలను పరవశింపజేస్తోంది.

పలుచన అయిన మునాన్ని హెచ్చరిస్తోంది జయమ్మ.

అలవాటులో పొరబాటుగా వరినాటుకులా కైవుపెట్టి నాటిన వాళ్ల తప్పును ఎత్తిచూపుతోంది.

తన సూచనల్ని పాటలో కలిపి నిర్లక్ష్యంగా కదిలే కూలీలపైన మండిపడుతోంది.

"వక్కాకు లేదాయె నోటికీ...

బో... బిక్కట్టాయెనమ్మ నేటికీ-

వక్కాకు లేదాయె నోటికీ..."

దీవనమ్మ గొంతు విప్పింది.

జయమ్మకు భుజాలు తడువుకొన్నట్లయింది.

అప్పటికే చాలాసార్లు వక్కాకు అడిగారు వాళ్లు.

వాళ్లని కూలికి పిల్చినపుడే తాను వక్కాకు మూటగట్టుకురావాల్సింది. మర్చిపోయింది. మద్యలో ఇంటికెళ్లేందుకు తీరిక దొరకలేదు.

ఊర్లో వాళ్లయితే ఇంతగా దేబిరించే వాళ్లు కాదు. పైటచెరగు ముడిలోనో, బొడ్లోని అడవంలోనో ఎవరి వక్కాకు వాళ్లు తెచ్చుకొనేవాళ్లు.

ఇండ్లల్లో వాళ్లే- తిండికీ వక్కాకుకూ యింతగా కొట్టుకులాడిపోతుంటారు.

పాట హుషారుగా సాగుతోంది.

అప్పుడప్పుడూ జయమ్మకేసి ఓరగంట చూస్తున్నారు కొంతమంది కూలీలు.

వాళ్ల చూపులు ఆమె ఒంటిమీద తేల్లు, జర్లయి పాకుతున్నాయి.

రెండు చరణాలు పూర్తయ్యాయి.

చివరి చరణానికి వచ్చేసరికి జయమ్మకు అసహనం పెరిగింది.

"తమలపాకిమ్మంటె తొలిశాకు యిస్తారు

వక్కపేడిమ్మంటె గొర్రెపెంటికిస్తారు.

సున్నమడిగితె గోడజూపి నవ్వేస్తారు.

పొగకాడ మొగమైన సూసినోల్లే లేరు.

ఎంత మొరటైందమ్మ యీ పాడు కొంపా!

ఎట్ట బతికేనమ్మ వక్కాకులేకా!"

పాట పరాకాష్టకు చేరింది.

ఆకుపాదంకంటే ముందు వక్కపాదం రావాలనీ, పాటలో అన్వయం తప్పిందనీ విశ్రాంతమ్మ తకరారు పెట్టింది.

జీవనమ్మ వొప్పుకోలేదు.

"వక్కాకే తేనెప్పుడు ఏమాటముందంటే ఏముందిలే తల్లే!" రిబకమ్మ నిట్టూరుస్తూ సర్దిచెప్పింది.

వాళ్ల పాట, మాట వింటోంటే- చిగురింత వెన్నుల్ని ఒంటికి కరిపించి లాగినంత అసహ్యాపు జలదరింపు కలుగుతోంది జయమ్మకు.

తన్ను దృష్టిలో పెట్టుకొనే పాడారు. సందేహంలేదు.

తనను అపహాస్యం చేస్తున్నారు.

వాళ్ల తెలివి మీరిన తనానికి ఒళ్లు మండిపోతూ వుంది.

మునంలో వెనకబడిన కమలమ్మ మీద తన అక్కసంతా వెళ్లగక్కింది.

నాటుకొంచెం పలుచనజేసిన మేరి పైకి 'గయ్'మని లేచింది.

వాళ్ల మాటలు, పాటలు, యికయికలు, పకపకలు, చిన్నచిన్న గొడవల్తోనే పొద్దుబోతోందనీ, పనిజరగటంలేదనీ గొణగసాగింది.

నాటుకంటే వాళ్లకు పాటలే ముఖ్యమయ్యాయని కసురుకొంది.

పాటవల్ల చేతులు సరిగ్గా ఆడించడం లేదనీ, మునాలు వెనకబడుతున్నాయనీ, నాటు సరిగ్గా అతకడంలేదనీ, యిట్లయితే పండిన పంటంతా నాటుకూళ్లకే సరిపోతుందనీ సన్నగా రాగాలు నూరసాగింది.

ఈ దెబ్బతో పాట కొంత కొతుకుబడింది.

మడవగడుతూవున్న మగాడు కాస్తా తలెత్తి భార్యకేసి వింతగా చూశాడు.

కొత్తదాన్నిలా చూశాడు.

ఎందుకట్లా ఆమె ఆరాటపడుతోందో అతనికి అర్థంకాలేదు.

నాటు అయిపోదేమోనని తను పడే ఆందోళనని కూలీలు గ్రహించలేదని కాబోలు- వాళ్లమీద కసి పెంచుకున్నట్లుంది.

తన బాధలో కొంతయినా వాళ్లు పాలువంచుకొని అనుభవించనందుకు అసహనపడుతోన్నట్లుంది.

ఆమె అట్లా వూహించటమే పొరబాటు.

తన పుట్టినింటి వాళ్లకులాగా యిది కాలువనీటి వ్యవసాయం కాదుగదా!

వర్షాన్ని, బోరుబావుల్ని నమ్ముకొన్న సేద్యానికి అంతులేని ఓపికవుండాలి. చేలోకి దిగి మట్టి పూసుకొని చేసేవాళ్లకు మాత్రమే ఆ ఓపిక వస్తుంది.

తమట్లా చేయలేమనేగదా కోరుకో గుత్తకో యిద్దామన్నది.

వర్షమూ, కరంటూ రెండూ సమయానికి రాకపోవటం యిక్కడ అతిసహజం. దాన్ని అర్థం చేసికోనోల్లు వ్యవసాయం ఎట్లా చేస్తారు?

అతని ఆలోచనలు పూర్తికాకముందే కరంటు బల్బు ఆరిపోయింది.

జయమ్మ ఆందోళన మరికాస్త ఎక్కువయ్యింది.

చేతిలో నారు కయ్యల్లో కుదురుగా నిలిపి గట్టెక్కారు కూలీలు.

గట్టుమీద కూచుంటూ మళ్లీ పాటలు మొదలెట్టారు. జయమ్మ ఆవేదన గురించి అస్సలు పట్టించుకోలేదు.

ఓవర్‌లోడువల్ల ట్రాన్స్‌ఫార్మర్‌లో ఫీజులు కాలిపోయాయి. చుట్టుపట్ల మగాళ్లతోబాటు తన మగడూ వెళ్లాడు ఫీజులు తగిలించేందుకు. బల్బు వెలగగానే స్టార్టర్ వద్ద మనిషి లేకపోవటం గుర్తొచ్చి కిందామీదా పడుతూ పరుగెత్తింది జయమ్మ. స్విచ్‌నొక్కి మోటార్ రన్‌జేసి వచ్చింది.

ట్రాన్స్‌ఫార్మర్ వద్దకెళ్లిన మొగుని తెలివితక్కువ తనం పట్ల మండిపడింది.

ఎవరోకరు ఫీజులు తగిలిస్తారుగదా! కనిపెట్టుకొనివుండి స్విచ్ నొక్కితే ఒక్కయ్య అయినా జమాయించి పారుతుందిగదా!

మొగుని చేతగానితనానికి తోడు కూలీల నిర్లక్ష్యం ఆమెకు భరించరానిదిగా వుంది.

తను టెన్షన్ అనుభవిస్తోంటే, వాళ్లు ఆనందంగా పాటలు పాడుకొంటూ గడపటం చింతకాయ కొరికినట్లుగా వుంది.

'ఊరిబైటి యిండ్లల్లో వాళ్లను కూలికి పిల్చటమే తప్ప'నుకొంది.

'వాళ్లకు కడుపుకింత తిండి, పంటికింద వక్కపలుకువుంటే చాలు- దేశంలోని పాటలన్నీ నాలుకమీదే.'

మడవ వద్దకొచ్చిన మొగునిమీద గయ్‌మని లేచింది.

పాటపాడే కూలీల గొంతుకలమీద ఊరకే నూరసాగింది.

పాటవల్ల వాళ్లు పొందే ఆనందం ఆమెకు అరగకుండావుంది.

తన అహాన్ని గాయంచేసేవాళ్ల గేయం ఆమెకు కంటగింపయ్యింది.

సణుగుడు ఎక్కువైంది.

పాటసైతం మద్యమద్య తునకలయ్యేలా గొణుగుడు స్థాయిని పెంచింది.

ఆమె నిరసనతో తమకు సంబంధం లేనట్లుగా చాలాసేపు నిర్లక్ష్యంగా ప్రవర్తించారు వాళ్లు.

చివరకు విషయం పూర్తిగా అర్థమై ఆమెకేసి వింతగా చూశారు... కొత్తగా చూశారు.... బాధగా చూశారు.... కసిగా చూశారు....

మరికొంతసేపటికి పాడుతున్నవాళ్ల గొంతులు కాస్తా మూగవోయాయి.

నాటుమాత్రం సాగుతూ వుంది.

వాళ్లమీద తనేదో విజయం సాధించినట్లుగా అనుభూతి కలిగింది జయమ్మకు.

పాటలేని నాటు ఆమెక్కొంత గర్వాన్ని కూడా కలిగించింది.

చేని నిండా పరచుకొన్న నిశ్శబ్దం తన తలకెత్తిన కిరీటంలా భావనకొచ్చింది.

'ఇండ్లల్లో వాళ్ల నోళ్లు మూయించింది బహుశా తనొక్కతేనేమో!'

ఆమె భావ ప్రకంపనలతో సంబంధం లేకుండా మరోసారి కరంటుపోవటం, రావటం జరిగింది.

పాటలేని నాటు నడుస్తూనే వుంది.

మడవగట్టే మొగోడికి మాత్రం యిది కొంత అసహజంగా తోచింది.

నాటులో ఏదో లయ తప్పినట్లుగా అనిపించింది.

**బల్బు వెలిగినట్లుగా అనిపించి ఉలిక్కిపడి నిశితంగా చూసింది.**
**ఎండ తీక్షణతకు తళతళమంటోందో, బల్బులోకి కరంటే వచ్చిందో పోల్చుకోలేని పరిస్థితి.**
**ఇంటాయన మాత్రం స్టార్టర్ వద్దే గొంతుక్కూచుని లల్లాయి పదాల మీదున్నాడు. ఆదుర్దా ఎక్కువైంది ఆమెకు.**
**అటుఇటు మోటార్లకేసి నిక్కినిక్కి చూసింది.**


**చతురస్రాలు నింపి బహుమతి గెలుచుకోండి**
**రూ. 15,00,000/- విలువచేసే బహుమతులు గెలుచుకోండి**

| | | |
|---|---|---|
| 6 | 11 | 4 |
| 5 | 7 | 9 |
| 10 | 3 | 8 |

ప్రత్యేక బహుమతి : మారుతి కారు, హీరోహోండా మోటారుసైకిల్, వెస్పా స్కూటర్ మరియు కలర్ టి.వి.
కన్సొలేషన్ బహుమతి : **MB, & HP** స్కీమ్ క్రింద కెమెరా, టు-ఇన్-వన్, చేతిగడియారాలు మరియు మిక్సీ గ్రైండర్

| | | |
|---|---|---|
| | | |
| | | |
| | | |

ఇచ్చిన నమూనా ప్రకారం 9 ఖాళీ చతురస్రాలు గీయండి. 5 నుంచి 13 వరకు అంకెలను ఉపయోగిస్తూ నిలువగా, అడ్డంగా, ఎటువైపు కూడినా మొత్తం 27 వచ్చేలా ఈ 9 చతురస్రాలను నింపండి, ఒక అంకెను ఒకసారి మాత్రమే ఉపయోగించాలి, మీ ఎంట్రీలను పోస్టు కార్డ్, ఇన్‌లాండ్ లేదా ఎన్వలప్‌లో 10రోజుల్లోగా ఆర్డినరీ పోస్టు ద్వారా పంపండి. మొదటి 2000 ఎంట్రీలకు 10గ్రా॥ బంగారు గొలుసు లేదా ఆషికా కెమెరా బహుమతిగా ఇవ్వబడుతుంది.

Add. : **SARDAR & CO.,** PO-Garhbanaili, Pin - 854325 (Purnea)

Publisher is not responsible for any disputes in this regard

మరేదో యిష్టంలేనితనం.

నాటు మునుపటిలా సక్రమంగా పడటంలేదు.

ఒక్కోచోట మెందుగా, మరోచోట పలుచగా... ఎగుడుదిగుడులుగా వుంది... కొంత అస్తవ్యస్తంగా వుంది.

అక్కడక్కడా పోతునారు మర్చిపోవటం కూడా జరుగుతోంది. జయమ్మ 'గయ్'మంది.

వాళ్ల వరధ్యానం మీద మండిపడింది.

వాళ్ల తప్పుల్ని పట్టించుకోని మొగుని మీద విరుచుకుపడింది.

జయమ్మ ఎంతగా తప్పుల్ని వెదకి చూపినా అవే పొరబాట్లని పునరావృతం చేస్తున్నారు వాళ్లు.

ఆమె కేకలేసింది... తిట్టింది.

వాళ్లు సమాధానం ఇవ్వలేదు.

పొరబాట్లని వదల్లేదు.

జయమ్మనోరు మరింత పెరిగింది.

తట్టుకోలేకపోయింది కమలమ్మ. "మేమేమో బాగానే నాట్లేస్తాండం. మానాటులో వారా రాలేదు. నీ సూపుల్లోనే వొచ్చింది" చెప్పింది కరుగ్గా.

"మా సేతయ్యేది యింతే తల్లీ!" దీవనమ్మ చెప్పింది.

అదంతా తన్ను లెక్కజేయని తనంగానే నిర్ణయించుకొంది జయమ్మ. వాళ్ల చేత ఎట్లా పన్జేయించుకోవాలో తెలిసిరాలేదు.

చాలాసేపు గొణుగుళ్లతోనే గడిపింది.

తర్వాత తనూ నోరుమూసికొంది.

ఎండాకాలవు మద్యాహ్నాల్ని గుర్తుజేస్తూ వుంది అక్కడి నిశ్శబ్ద వాతావరణం. ఆ మౌనాన్ని భరించలేకపోతున్నాడు మడవమనిషి.

ఏదో పోగొట్టుకొన్నట్లుగా వుంది అతనికి. కూలీలమీద తన భార్య పెత్తనం చూపే పద్ధతి నచ్చలేదు.

తనేమీ చెప్పలేని నిస్సహాయస్థితి.

వాళ్లకు మూగతనం అంటించి ఆమె పొందే తృప్తి అర్థమైంది. కరంటు మీది కసి రూపుమార్చుకొంది.

'ఒక్కగంట కరంటుకోసం స్టార్టర్ వద్ద సాయంత్రందాకా అయినా గొంతుక్కూచుని నిరీక్షించే ఓపిక ఉన్నపుడే వ్యవసాయం జోలికి రావాలి' నిస్తేజంగా చూస్తుండిపోయాడు.

అంతలో అటుగా వచ్చింది పక్కచేలో గడ్డి పెరుక్కొంటూ వున్న వెంకటమ్మ.

"యాందెంద్రా! పాటల్లేకండా నాద్తాంద్రు... పైరు మూగబోతదంద్రా!" అంది.

"పాట పాడంద్రే!" అంటూ కూలీల్ని ఎగదోసింది.

"యీయమ్మకు మూగిపిల్లోల్లంటేనే యిట్టమంటలే..." మేరెమ్మ చెప్పింది.

చివుక్కున తలెత్తి చూసింది జయమ్మ.

"నలుగుబెట్టేప్పుడు పదమన్నా పాడించుకొన్నెవా లేదా పిల్లా?" కడుపుతోవుండావు. జాగర్త" వెంకటమ్మ ఎకసక్కెంగా అంది.

"సాల్లే నీ సంబడం" గొణుక్కొంది జయమ్మ. అప్రయత్నంగానే చేత్తో కడుపు తడువుకొంది.

ఎన్ని క్షేత్రాలు తిరిగిందనీ! ఎన్ని తీర్థాల్లో మునిగిందనీ! ఎన్నేళ్లపాటు ఏడ్చిందనీ!- యీ కడుపుకోసం.

వెంకటమ్మ వెళ్లిపోయింది గాని పాట మొదలవలేదు.

నాటు సక్రమంగా పడటంలేదు.

వాళ్ల శరీరమంతా ఏదో మదపుతనం ఆవరించుకొన్నట్లుగా అనిపించింది జయమ్మకు.

తను గొణిగినా, తిట్టినా లెక్కజేసేట్టు లేరు. వాళ్ల నాటులో ఏదో సహజత్వం కనుమరుగయ్యింది.

మరేదో లయ లోపించింది.

చేత చిన్న చక్రాన్ని దొర్లించుకొంటూ అలసట తెలీకుండా పరువెత్తే పసిపిల్లాడిలా సాగాల్సింది నాటు. ఊతకర్రలేని ముసలి నడకలా వుంది.

తలపట్టుక్కూచుండిపోయింది ఆమె.

కొంతసేపటికి ఎక్కడిదో సన్నని రాగం విన్పించి అటుకేసి చూసింది.

సన్నసన్నగా కూనిరాగం తీస్తున్నాడు తన మగడు.

కూలీలకు సైగజేస్తున్నాడు- గొంతు కలపమని.

"కపిలదోలే చిన్నవాడా! కాపోల్ల కుర్రవాడా!

గావతాడు వదలిపెట్టబ్బీ! నా గుండె కేసిన

చూపుగాలం వూడబెరుకబ్బీ!"

పార మడవలో వదలి లయగా చిటుకేస్తూ పాడుతున్నాడు.

అతనికేసి ఆశ్చర్యంగా చూశారు కూలీలంతా.

వాళ్ల చేతుల్లోని నారు సైతం తలనిక్కబెట్టింది వింతగా.

అతను రెండు చరణాలు కూడా పూర్తి జేయకముందే ఆగలేక గొంతు కలిపింది విశ్రాంతి.

"బారిగుంతకు తీరికుండదు. మొరపు చేనికి దప్పికారదు.

గాదెనిండే కాలమెపుడబ్బీ? నా వలపుపంట ఓదెలేసే మూర్తమెపుడబ్బీ?"

నీళ్ల తడిసోకి పచ్చనవుతోన్న వాడిన పైరులా కూలీల్లో క్రమంగా హుషారు వచ్చింది.

పాట పూర్తయ్యేసరికి అందరూ సర్దుబాటయ్యారు.

పాటవెంట మరోపాట ఉరకలేసింది.

చేతివాటం కూడా మెరుగయ్యింది.

నాటు క్రమబద్ధంగా పడుతున్నట్లే తోచింది జయమ్మకు.

పాటలు పాడుతుంటేనే వాళ్లు సక్రమంగా పనిచేస్తారనే విషయం ఆమెక్కూడా అర్థమైంది. తనపైన వాళ్లు విజయం సాధించారు.

తమ పట్టు నిలబెట్టుకొన్నారు.

వాళ్ల ఆనందానికీ, దాన్ని వ్యక్తంచేసే గొంతుక్కీ అడ్డపడేశక్తిని తననుండి లాగేశారు. ఏది ఏమయితేనేం?- సక్రమంగా పనిజరుగుతూ వుంది.

అది చాలనుకొంది ఆమె.

మొగునికేసి చూసింది. అతని మొహంలో ఏదో ఆనందం.



"యీయమ్మకు మూగిపిల్లోల్లంటేనే యిట్టమంటలే..." మేరెమ్మ చెప్పింది.
చివుక్కున తలెత్తి చూసింది జయమ్మ.
"నలుగుబెట్టేప్పుడు పదమన్నా పాడించుకొన్నెవా లేదా పిల్లా?" కడుపుతోవుండావు. జాగర్త" వెంకటమ్మ ఎకసక్కెంగా అంది.

నిజంగానే అతనికి చాలా సంతోషంగా వుంది.

ఆమెలో కనిపిస్తూవున్న మార్పు ఉల్లాసాన్ని కలిగిస్తూ వుంది.

ఇప్పుడు నాటుకూడా పాటల సాగుతూవుంది. వచ్చవచ్చగా వయ్యారాలు పోతూవుంది.

యజమానురాలు తమను ఎంతటి మానసికవ్యథకు గురిజేసినా, అంతా మర్చిపోయి పాటలై కరగుతూవున్న కూలీల్ని చూసి అబ్బురపడ్డాడు అతను.

వాళ్ల ప్రకృతే అంత.

బాధల్లోనూ పాడుతుంటారు.

సంతోషంలోనూ పాడుతుంటారు.

ఆకలిని సైతం పాటల్లోనో, తమాషా మాటల్లోనో మరచిపోయి బతుకుతూ వుంటారు. వాళ్ల వొళ్లంతా పాటలే.

ఎక్కడ తాకినా పాటే విన్పిస్తుంది.

"ఇన్ని పాటలు మీకెట్లా వొచ్చు? యాడనేర్చుకొన్నెరు?" అడిగాడు- వాళ్లకేసి ఆశ్చర్యంగా చూస్తూ. ఈ ప్రశ్న తనలో చాలారోజులుగా నలుగుతూ వుంది.

తమ ఆడాళ్లకు అందని ఇంత పదాల సంపద వీళ్లకెట్లా అబ్బిందో? ఎక్కడివో యీ పాటలన్నీ?.... ఎవరివో...?

మునంలోంచి నిటారుగా నిల్చుంది దీవనమ్మ.

"యీ పాటలన్నీ మీవే..." చెప్పింది.

ఆమె చేతిలోని సొద్దనారు వయ్యారాలు పోతూవుంది.

నొసలు ముడేసి చూశాడు ఆమెకేసి.

"పాటలన్నీ బండినిండా పోసుకొని మీరు తోలకపోతావుంటే- బండి మాయిండ్లముందు వాటుబడింది. వేంపరుగెత్తుకొంటా వొచ్చి అందినకాడికి పాటలేరుకొని కొంగులో పోసకపొయ్యినం..." నవ్వుతూ చెప్పి మరో పాటను అందుకొంది.

జయమ్మ కూడా వింతగా చూసింది వాళ్లకేసి. పాటల్ని బండిలో పోసుకపోవటం, బండి వాటుబడటం, వాళ్లొచ్చి పాటల్ని ఏరుకోవటం... అంతా అయోమయంగా తోచింది.

అతనిక్కూడా యీ పిట్టకథ అంత సులభంగా అర్థంకాలేదు.

వ్యవసాయిక జీవితపు మూలాల్లోకి తొలుచుకొంటూపోతేగాని తెలిసిరాలేదు.

రాత్రి భోంచేసిన తర్వాత ఆలుమగలిద్దరూ సుదీర్ఘమైన చర్చకు దిగితేగాని 'పాటలబండి' సంగతి ఓ కొలిక్కిరాలేదు.

నిజమే.

తమ పాటల్ని వీళ్లు దోచుకున్నారు.

పాటలబండిని వాటుబడేలా చేసి మరీ తస్కరించారు.

మట్టిలో పొర్లాడే రైతుదనం నుంచి గట్టుమీద కూచుని అజమాయిషీ చేసే రెడ్డిరికపు దశకేసి పయనించే తాము- తమకక్కరలేని శ్రమ సౌందర్యపు పాటల్ని బండికెత్తి దూరంగా తోలుతూ వుంటే వాళ్లు కాజేశారు.

పనీపాటా ఒకే ఆత్మస్వరూపంగా భావించే అద్వైతానంద స్థితికి వాళ్లు చేరుకొంటూ వుంటే- పాటను వేరుచేసినపుడే స్వచ్ఛమైన పని అవతరిస్తుందన్న మేధావితనానికి తామిప్పుడు దగ్గరవుతున్నారు. వాస్తవంగానే తాము పాటల బండిని వాటేసుకొన్నారు.

వాళ్లొచ్చి పాటల్ని కొంగులో పోసుకుపోతోంటే వాళ్లని అమాయకుల్నిలా చూశారు.

ఇప్పుడర్థమవుతూ వుంది- ఎవరు అమాయికులో? ఎవరు పిచ్చివారో? ●

## ఎవరి ప్రేమలోనూ లేను: శిల్పాశెట్టి



"నన్ను ఎవరయినా ప్రేమించానని చెప్పగానే సరిపోదు, తన ప్రేమను నిరూపించుకోగలగాలి" అంటోంది శిల్పాశెట్టి. "నిజంగా నన్ను ప్రేమించే మనిషిని నేను గుర్తుపట్టగలను. కాని అలాంటి మగవాడు ఇప్పటివరకు తారసపడలేదు. అయినా నాకు ఇప్పుడు ఈ వ్యవహారంపై ఆసక్తి లేదు. ఇప్పుడు నటించడమే నా తొలి ప్రాధాన్యం. అందుకోసం ఎంతయినా కష్టపడాలనుకుంటున్నాను. ప్రస్తుతానికి నా పనిలో మునిగితేలాలనుకుంటున్నాను. నేను విధిని నమ్ముతాను. కనుక నన్ను ప్రేమించే వ్యక్తి ఎప్పుడయినా తను నా దగ్గరికి రావాలనుకుంటే వస్తాడు. ఇప్పుడైతే ఎవరి ప్రేమలోనూ లేను" అని తనమీద వచ్చే పుకార్లను కొట్టిపడేసిందామె. తన విలక్షణమైన అందచందాలతో ఎంతోమంది మగాళ్ల మతులు పోగొట్టే శిల్ప జీవితం ఎలా మలుపు తిరుగుతుందో చూడాలి మరి!